★ మధ్యవర్తి ★

[కథానిక]

శ్రీ శివరాజు
వెంకటసుబ్బారావు
[బుచ్చిబాబు]

ఏకాంతాన్ని కవులు మహా మెచ్చుకుంటారు. అది స్వార్థాన్ని మరిపిస్తుం దనీ, అందులో మానవుడు తన ప్రాధాన్యతను కోలుపోతా డనీ వారి వుద్దేశం. కాని యిది పూర్తిసత్యం కాదు. సముద్రకెరటాల హోరు ఏకాంతాన్ని భగ్నంచేస్తుంది. ఏకాంత స్థలంలో యేచిన్నధ్వనో, వొంటిది కావటం నుంచి, ఆనందంలోకి జారిపోయిన మనస్సును పురిగొల్పి వెనక్కు మళ్లిస్తుంది. నిజానికి, పట్నవాసంలో వున్నవాళ్లే, ఆ జనసమూహంలో, తమ వ్యక్తిత్వాన్ని గోల్పోతూ వుంటారు. ఆపట్నవాసపు రొదలో తాము యెవరైందీ, యేంచేస్తోన్నదీ మరిచి, చెదిరిపోయిన వ్యక్తిత్వాన్ని తిరిగీ స్థాపించుకోటానికి మధ్యలో యేపల్లెటూరో పారిపోతూ వుంటారు. ఏకాంతానికీ, మానసిక వాతావరణానికీ సంబంధం వున్నా, సదా లోకం చేసే రొదకుకూడా మానవుడి వ్యక్తిత్వం మీద కొంత అధికారంవుంది.

రోగికి మందివ్వడానికి పట్నం వొదిలి పల్లెటూరు రావడం డాక్టరు దినకర్‌కు అదే మొదటిసారి. తెనుగుదేశం వొదిలి చెన్నపట్నంలో స్థిరపడిపోయి, ఆంధ్రులతో తాము ఆంధ్రుల మనీ, అరవలతో అరవల మనీ చెప్పుకుంటూ వుద్యోగాలు చేస్తున్న వ్యక్తులలో దినకర్ వొకడు. అతనికి పాతికేళ్లకు పైమాటే. నాగరికతను వొక మహాశక్తిలాగ ఆరాధిస్తాడు. స్త్రీ సంపర్కంవల్ల పురుషుడు సంపాదించిన జబ్బు లనే బంధనాలనుండి విముక్తుణ్ణి చేసింది నాగరిక తేనని అతడు చాలామార్లు వాదించాడు. మన సంఘం అలాంటి వ్యక్తుల్ని హరిజనులలాగ బహిష్కరిస్తుందనీ, వాళ్లను నాగరికులు చేరదీసి, వారి బాధకు సానుభూతి చూపి, బైటపడే మార్గం చూపిస్తారనీ అతని వృత్తికి సంబంధించిన వాదన. మనిషికి యేజబ్బుప్రాప్తించినా, నైతిక విమర్శకుమాత్రం గురి కాదు. అన్నిజబ్బులూ మారణానికే దారితీస్తాయి. ఆవ్యక్తిని రక్షించటం సంఘం విధి. ఇది తెలియనివాడు అనాగరికుడు. ఇట్లాంటివెన్నో దినకర్ మనసులో ఆలోచించుకుంటూ వుంటాడు. నాగరికతమీద వొక గ్రంథంకూడా వ్రాయాలని సంకల్పించాడు. దినకర్ బ్రహ్మచారి. అనేక భావాలు మనస్సులో ప్రాకులాడుతున్నా, యథార్థం తేల్తేనేకాని అవి అతుక్కోవు. లేకపోతే ప్రతిమానవుడూ అధమం వొక్క పుస్తకమేనా రచించి మరీ ప్రాణాలు వొదుల్ను. అత నింకా యెందుకు పెండ్లి చేసుకోలేదో అతనికే తెలియదు. "నీకూయెవ్వారు లేరు, నాకూ యెవ్వారు లేరు" అన్న పాటలోలాగా యెవ్వరూ 'నా' అనేవాళ్లు లేని పిల్ల దొరికితే చేసుకోవాలని అతని ఆశయం. పెద్ద కుటుంబంలోని పిల్లను చేసుకుంటే చాలా బాధలు

వున్నాయని పట్నంహోరులో తన వ్యక్తిత్వాన్ని గోల్పోతూ, అనుకున్న గ్రంథాన్ని వ్రాయలేకపోతున్న దినకర్‌కు స్ఫురించటంలో ఆశ్చర్యంలేదు.

పల్లెటూరంటే అల్లా వుంటుందని అత ననుకోలేదు. అప్పుడక్కడ తిరణాల్లుకూడా జరుగుతున్నాయి. తన వ్యక్తికి అక్కడొచ్చిన ప్రధానత యిదివరకెప్పుడూ రాలేదు. సందుల్లో నడుస్తుంటే, జనం తొలిగిపోయి, అతనికి మార్గం చేస్తున్నారు. అందరూ అతనికేసి వొక వింతవస్తువులా చూస్తున్నారు.

ఆ గుంపుల్లో వున్న పురుషుల్లో చొక్కావున్నవాళ్లు తక్కువ. చాలామంది స్త్రీలకు అసలు రవికలే లేవు. స్త్రీవేషధారణలో పమిటకున్న ప్రాధాన్యత వాళ్లకు తోచినట్లే లేదు. అసలు వాళ్లకు స్త్రీపురుష వివక్షతే వున్నట్టు తోచదు. అమాంతం వాళ్ల గుడిసెల్లో జొరబడి సోదాచేస్తే, వాళ్లు దాచుకునే వస్తువులు యేమిటా అని అతను ఆలోచించడం మొదలెట్టాడు. వాళ్లకు గుట్టు, రహస్యం, మనస్పర్థలు వుంటాయా? ప్రకృతి, ప్రేమ, కళలు, నాగరికత సంబంధమైన జబ్బులు, వాటిచికిత్సలు వాళ్లకు తెలుసా? ఆ పల్లెటూరికి పుట్టినట్లుగా వున్నారు వాళ్లు. వాళ్ల శరీరపు సహజమైన సొంపు మూలపడి పాతపడిపోయిన ఆకర్షణశక్తులను రెచ్చగొట్టింది. తన శరీరాన్ని తడిమిచూచుకున్నాడు. మనస్సేకాకుండా శరీరంకూడా మాట్లాడగలదనీ, దేన్నో కోరి దానికోసం దౌర్జన్యం చెయ్యగలదనీ అప్పుడు గ్రహించుకున్నాడు డాక్టరు. అతనికి రంకులరాట్నం యెక్కి వాళ్లతోపాటు తిరగా లనిపించింది. కాని అంతా నవ్వుతారేమో? ఆ తిరిగేవాళ్లల్లో తాను వైద్యానికొచ్చిన రాఘవరావుగారింట్లో ప్రొద్దున్న చూసిన పిల్లకూడా వుంది. రాఘవరావుగారికి వుపచారం చేస్తో మంచంప్రక్కన నిలబడ్డ పిల్ల అదే. కొంపతీసి దాసీపిల్ల కాదుకదా. ఆ బట్టలు, ఆ వేషం, ఆ వెఱ్ఱి చూపులు బీదతనాన్ని సూచిస్తున్నాయి. కాని రాఘవరావుగారు యీపిల్లను "మాకాంతం, మాకాంతం" అంటూ వొచ్చారేః? వివాహమైన పిల్లే ఐతే, యిట్లా వాళ్లతోపాటు కలిసి రంకులరాట్నం యెక్కుతుందా? వెధవపేరు—రంకులరాట్నంట!

దగ్గరగా వెళ్లి నిలబడ్డాడు. గుఱ్ఱాలు వేగంగా తిరగడంవల్ల కాంతం అతన్ని చూస్తూవుందన్న సంగతి తెలియదు. గుఱ్ఱాలు నిలిచాయి. ఇంకా దిగదేం? కాంతంగుఱ్ఱం తనముందే ఆగింది.

"ఇట్లా తిరగటానికి రేటు యెంత?" అని అడిగాడు.

"కానీకి ఆరుసార్లు" అంది కాంతం.

"అబ్బా... నీపేరు?"

"కాంతమ్మ."

"ఐతే నీకు, మరి..." అంటూ దిక్కులు చూశాడు డాక్టరు. ఇంతలో గుఱ్ఱం కదిలింది. ఆయాసపడ్డంవల్ల కాబోలు, కాంతం శరీరపువాసన, గుఱ్ఱం తనప్రక్కకు వచ్చినప్పుడల్లా, దినకర్‌కు తగిలింది. కాంతంతో మాట్లాడిన కాసేపు అతన్ని ఆకర్షించే లక్షణా లేవీ ఆమెలో కనిపించలేదు. కాని ఆ శరీరపువాసన అతని ఇంద్రియాలపై కొంత అధికారం చెలాయించింది. "నీకు పెళ్లయిందా?" అని అడిగాడు.

"ఏమిటండీ?" అంది బిగ్గరగా, స్వారీ చేస్తూ.

"పెళ్లి, పెళ్లి."

"పెళ్లి?"

"అయిందా?"

"ఆ."

మళ్లా గుఱ్ఱం జోరు తగ్గి ఆగడం మొదలెట్టింది.

"అవుతే, నీభర్త యేమీ అనడూ?"

"భర్తేమిటి?" అంది ఆశ్చర్యంగా నవ్వుతూ.

"మొగుడు."

"మొగు డెవరికి?" అంది ఆయాసం మధ్య.

"పెళ్లయిందన్నావ్, మరి?"

"ఎప్పుడూ?"

"ఇందాకా."

"ఊరికే నే" అంది.

దినకర్‌కు యిందులో కాంతం హాస్యపుశక్తి కనిపించింది. కాని పొరబడ్డాడు. అది అమాయకపు సమాధానం. నిజానికి, అతడు వేసిన ప్రశ్న ఆమెకు వినిపించలేదు. అత నేదో అడగబోయాడు. తటాలున గుజ్జంమీంచి దూకి, పరుగెత్తుకు పోయింది.

౨

ఒక్కరో జనుకున్నదల్లా దినకర్ వొచ్చి అప్పుడే నాలుగు రోజులైంది. ఆలోచిస్తే అన్నిరోజు లక్కడుండేందుకు బలమైన కారణాలు కనిపించ లేదు అతనికి. రాఘవరావు తనకు బంధువు కాదు. ఆయనకూ, తన తండ్రికీ స్నేహంట, యెప్పుడో. "మావాడు డాక్టరు ప్యాసై వొస్తాడు. మన మింక డాక్టర్ల కోసం ఆవూరూ యీవూరూ పరుగెత్త నక్క ర్లేదు లెండి" అనేవాట్ట రాఘవరావుతో. ఆయన దినకర్‌ను చిన్నతనంలో చూశాట్ట. మళ్లా యిదే చూట్టం. రాఘవరావు చాలా ఆస్తిపరుడు. బి.ఏ. తో చదువు చాలించి, ఆరోగ్యంకోసం చాలారోజులు భార్యతో బెంగుళూరు, ఊటీలలో గడుపుతూ, యీనాటికి భూములు చూసుకుంటూ, యీ పల్లెటూళ్లో కాపర ముండిపొయ్యాడు. ఇంతకాలం బస్తీలలో కాలం గడుపుతూ డబ్బుతగలెయ్యడానికి కారణం కొంతవరకు ఆయనభార్య కమల. అప్పటికి ఆవిడకు పాతికేళ్లు వుంటాయి. బాగా ఇంగ్లీషు చదువుకున్నది; పట్నాలలో స్త్రీల క్లబ్బుల్లో చేరి, చాలా చెలాకీగా పనిచేస్తూ, స్త్రీసంఘాల్లో చాలావాటిల్లో పాల్గొని కొంతకీర్తి సంపాదించింది. కమల అనాకారిది కాకపోయినా, చూడగానే రూపసి అనేటంతటి చక్కంది మాత్రం కాదు. పెండ్లికిపూర్వం స్త్రీని అందరూ చక్కందే అంటారు. పెండ్లైనప్పటినుంచీ తను చక్కంది అన్న నమ్మకం బైద్దేరి, కొంతబాధ కలగ చేస్తూవుంటుంది స్త్రీకి. కమలకు యీనమ్మకం చాలా అశాంతిని కలగచేస్తుంది. కాంతం తన పెత్తల్లికూతురు. తనకంటె చాలా చక్కందని ఆమె తెలుసుకుంది. కాంతానికి యింకా వివాహం కాకపోవడం, తను చక్కందని కాంతానికి తెలియదని తను తెలుసుకోవడం కమలహృదయంలోని ఆరాటానికి సైకలాజికల్ కారణా లనొచ్చు.

అతన్ని పట్నంనుంచి రప్పించడం కొంత ఆశ్చర్యం కలగచెయ్యకపోలేదు దినకర్‌కు. అతనికి వెళ్లిపోవాలని వున్నా యీ పల్లెటూరిజీవితం వొదిలి వెళ్లడానికి మనస్సు యెగిరి గంతువేసింది కాదు. అక్కడి ప్రకృతిలో వున్న ప్రశాంతమే కాకుండా, కాంతంకళ్లల్లో చాలా ప్రశాంతం కనిపించింది అతనికి. సంభాషణవల్ల కాంతానికి ఆయింట్లో ప్రాముఖ్యత లేదని తెలుసుకున్నాడు. ఆపిల్లకు పదహారేళ్లు వొచ్చినా, తనకు పెండ్లి కాలేదని తెలుసుకుని కూడా, రాఘవరావు కాని, అతని భార్య కాని కాంతంపెండ్లి సంగతి ముచ్చటించకపోవడం అతనికి కష్టం కలగ చేసింది. ఒకవేళ కాంతానికి భర్త యిదివరకే యేర్పడి వున్నాడా? లేక కొంపతీసి కన్యాశుల్కంలో బుచ్చమ్మలాగా 'ప్రెటీ లిటిల్ విడో' కాదుకదా! మొత్తం మీద ఆరాత్రి వెళ్లడానికి నిశ్చయం చేసుకున్నాడు. సాయంత్రం నాలుగైంది. కమల తలకు పట్టేసుకుని పరుంది. తన చెయ్యి చూడమంది. నాడి పరీక్ష అయిం తరవాత—

"మీనాడి బాగానే వుందే?"

"ఎందుకో చాలా తలనొప్పిగా వుందండీ; నా హార్ట్ పరీక్ష చెయ్యండి..." భర్త ఆరోగ్యాన్ని గురించిన బెంగవల్ల యీమెకు యీ అస్వస్థత కలిగిందేమో నని దినకర్ అనుమానపడ్డాడు. కాని రాఘవరావు ఆరోగ్యానికి ప్రమాదం లేదే? గుండెలు పరీక్షచేశాడు. ఆత్రతతో గుండెలు దడదడ కొట్టుకొంటున్నవి, నిజమే. కాని డాక్టరుకు శరీరానికి సంబంధించిన కారణ మేదీ స్ఫురించలేదు. తనకు అర్థంకాని జబ్బులు యెందుకుండకూడదూ?

ఆరాత్రికూడా అతని ప్రయాణం ఆగిపోయింది. నిద్రపోయేముందు తియ్యని భావా లుండాలని పిల్లల పుస్తకాలలో వున్నా, అవి ఫలానా అని యెవ్వరికీ తెలీదు. డాక్టరుకు తను చూసిన హాస్పిటల్‌దృశ్యాలు

స్మరణకొస్తాయి. దినకర్‌కు స్త్రీలంటే అమితభయం. వాళ్ల జబ్బులు చాలా చిత్రమైనవి. హిస్టీరియా మరీ విచిత్రమైంది. ఆ మూలుగుతూ కృశించిన స్త్రీశరీరం ఆతని వూహాపై ఒత్తిడికలిగించి, యీలోకంలో మానవుడు జనించడం చాలా విచారకరమైన దన్నది అతని తియ్యనిభావం. పురుషులకు వుద్యోగాలు లేక, ఉద్యోగం దొరికింతర్వాత, సంపాదించే ద్రవ్యమంతా భార్య జబ్బుకోసం ఖర్చుకావడం, చివరికి మూలగడం, హిస్టీరియా, పూర్తి ఉన్మాదం, మరణం—యిదీ మన బ్రతుకు. ఈ మూలిగే లోకాన్ని వుద్ధరించగలిగింది ప్రేమ, శృంగారం అని అంతా చెప్పకుంటారు. కాని యీభ్రాంతికి ఆయుస్సు తక్కువ. సౌందర్యం తన మెరిసిపొయ్యే నేత్రాలను నిలబెట్టుకోలేదు; యౌవనం కృశించి, నీరసించి అస్థిపంజరం అవుతుంది. వృద్ధాప్యంలో నశించేవరకూ తెల్లవెండ్రుకలు రాలడం మానవు. ఈభావాలు తియ్యనివి కావు. బ్రహ్మచారైన డాక్టరుకు యివే తియ్యని భావాలు. మానవుడు తన భుక్తికోసం నిర్మించుకున్న లోకాన్నే ఊహలోనికి దింపుకుని, దాన్లోంచి బైటపడలేడు.

దోమలు పీకడం మొదలెట్టాయి అతన్ని. ఒకటి ముక్కుమీదవాలింది. గట్టిగా ముక్కుపట్టుకు లాగాడు; ముక్కు వూడిరాదుగాని, లేకపోతే వూడాలిసిందే—దోమ చిక్కదు. ఊహాప్రపంచంలోనుంచి బాహ్యానికి దింపగలిగిన శక్తి రాత్రిపూట దోమకే వుంది. మరి మార్గం లేదు. కిందకు నడిచినా, పైకి నడిచినా, మానవుడు కుంటుతూ నడవాలిసిందే.

గడియారం వొకటి కొట్టింది కొంతసేపటికింద, మళ్లీ వొక గంటే కొట్టింది. అప్పుడే ఒంటిగంట దాటిందా! దినకర్ లేచి గడియారం చూశాడు. తీరాచేసి పదన్నర కొట్టింది. అప్పుడు గడియారం అరగంటలుమాత్రం కొట్టి వూరుకుంటుంది. కమల మైమరచి నిద్రపోతోంది. రాఘవరావు దోమలతో చేసే యుద్ధంతాలూకు శబ్దాలు వినిపిస్తున్నాయి. మెల్లగా దొడ్డితలుపు తీసి నూతివద్దకు వెళ్లాడు. జామచెట్టుకింద చాపమీద కూర్చుని, చంద్రుడికేసి చూస్తూ, జామపండు తింటూంది కాంతం. తెల్లటిచీర, తెల్లటి రవిక, తెల్లటి చంద్రుడు— పట్నంలో యింత ప్రశాంతంగా ఆకాశంకేసి చూస్తూ కూర్చునే స్త్రీలు వున్నారా? అసలు చెన్నపట్నంలో జామచెట్లున్నాయా? కాంతం కంగారుపడి లేవబోయింది. తనకు నిద్రపట్టలేదనీ, అసలు ఆమెతో మాట్లాడడానికి వొచ్చాననీ చెప్పి, యెట్లాగో బతిమాలి కూర్చోపెట్టాడు.

"ఇల్లా వొంటిగా కూర్చున్నావేం?" అని అడిగాడు.

"ఏమీ లేదండి" అంది జామపండు కొరుకుతూ. అది తింటూ, తనకు కావాలా అని అడగకుండా కూర్చోడం అతనికి కష్టంగా తోచింది.

"జామపండేనా అది — ఎక్కడిది?"

"ఇదిగో చెట్టు. వొక్కటే వుంది." ఈసమాధానం అతన్ని స్తిమితపరిచింది.

"పండా, కాయా?"

"మధ్యరకం."

"అవుతే, కాంతం! నీ సంగతంతా రాఘవరావుగార్ని అడిగి తెలుసుకున్నా. నీకు తల్లిదండ్రులు లేరుటగా, పాపం. మరి నీ పెళ్లిమాట యేమన్నా ఆలోచించారా?"

"ఏమో నాకు తెలీదండి."

"మరి నీకు తెలీకపోతే యెల్లా? నాకు నిన్ను చూస్తే జాలిగా వుంది. ఇక్కడ నువ్వు దాసీదానిలాగా వున్నావు. దానికేం-నీకు పెండ్లిచేసుకోవాలని వుందా?"

"నాకు తెలీదండి."

"పోనీ, నామీద నీకు యిష్టం వుందా? నాకూ పెండ్లి కాలేదు."

దీనికి సమాధానం లేదు.

"నీకు యిష్టం వుంటే, మన పెండ్లికి యే అభ్యంతరం లేదు."

"మా అక్కనూ, బావనూ అడగాలండి."

"నీయిష్టానికి వాళ్ల నడిగే దేమిటి? నువ్వు 'ఊఁ' అంటే, యెల్లాగైనా సరే పెండ్లిచేసుకుతీరతా. అసలు, వాళ్లు నువ్వు యిక్కడనుంచి పోతేనే చాలునని వుంటారని నా నమ్మకం."

ఒకవిధంగా యీ నమ్మకం సరైంది కాదు. కాంతానికి పాతికకరాలదాకా వున్నా రాఘవరావు ఆపిల్లకు వోచదువు, వోసంగీతం అనేవి లేకుండా, కేవలం వుపచారంనిమిత్తం వుంచుకున్నాడు. ఆయనకు కాని, ఆయన పెండ్లానికికాని కాంతం పెండ్లివిషయమే జ్ఞాపకం లేకపోవడం విచారించవలసిన విషయం. ఈ సంగతి కాంతానికేనా తోచినట్లు తోచదు. ఆమె సంభాషణలో అసంతృప్తిభావన కనిపించదు. తను భార్యకావడానికే యీ లోకంలో స్త్రీగా జనించిందని కాంతానికి తెలియదా? పదహారేళ్లొచ్చిన పిల్లకు కోర్కెలూ, ప్రేమా వుండవూ? కాంతానికి యుక్త వయస్సొచ్చినా హృదయం, మనసు, కోర్కెలు బాల్యంలోనేవున్నాయి. ఈ బాల్యానికి సంబంధించిన చిహ్నాలు శరీరంలోకూడా కనిపిస్తాయి. ఆకళ్లతో మనకేసి చూస్తున్నా మనం కనిపించ మేమో అన్న అనుమానం కలగచేస్తుంది. మాట్లాడేటప్పుడు, విషయం యెల్లాంటిదైనా, పెదవుల కదలిక నవ్వులు దాచినట్లుంటుంది. ఆచెక్కిళ్లలోని సాఫీ, సంతుష్టీ హృదయాన్ని సూచిస్తాయి.

"నువ్వు సమాధానం చెప్పకపోతే నాకు దిగులుగా వుంటుంది. ఇష్టం లేకపోతే లేదని చెప్పు. నేనేమీ అనుకోను." అని మళ్లా మొదలెట్టాడు డాక్టరు.

"ఏమోనండి... నే వెళ్లి పడుకుంటాను..." అని లేవబోయింది. డాక్టరుకు కోపం వచ్చింది. కథలలో నాయికలు వసపోసిన పిట్టలలాగా అల్లా వాగుతారే, యీపిల్ల ప్రశ్నకు సమాధానమేనా చెప్పలేదే? కాంతం పల్లెటూరి పిల్ల. అతనికి యీపట్నవాసపుస్త్రీలను చూసింతర్వాత, శరీరంలేని హృదయం కలవాళ్లైతే, వివాహానికి అర్హులు స్త్రీలు అనిపించేది. ఇప్పుడు కాంతం అల్లాంటి శరీరంలేని హృదయం. శరీరం లేదు, వాక్కుకూడా లేదు. ఇట్లాంటిది దినకర్ ఆదర్శమైనా యీవస్తువుకు లోపల 'ప్రేమ' అనేది వుంటుందా అని అనుమానం తట్టింది. నిప్పం లేకదా పొగ రావడం? అందుకనే, యిట్లా పదేపదే ప్రశ్నించడానికి కారణం.

"నేను నీకోసమే యీవూళ్లో యిన్నిరోజులాగాను. నువ్వు పడే అవస్థ చూస్తే జాలిగా వుంది. నీకు నామీద యిష్టం లేకపోతే, నేను బెంగతో రేపు యింటికి వెళ్లిపోతాను."

"అల్లాగైతే, మా అక్క నడిగి రేపు చెపుతాలెండి" అంది.

"ఛా, ఛా — నీప్రేమకు మీ అక్కను అడగడం యేమిటి?"

"పోనీ, యీసారొచ్చినప్పుడు."

"అల్లాకాదు" అని చేతులు పట్టుకోబోతాడు.

"అబ్బ! — పోనీ, మీరెళ్లింతరవాత ఉత్తరం రాస్తా లెండి..." అతన్ని తప్పించుకు పారిపోయింది. కాని, దొడ్లో వస్తువులు యింట్లో పెట్టడానికి మళ్లా వచ్చింది.

"నన్ను పట్టుకోకండి, నాకు భయంగావుంది."

"ఎందుకు భయం? ఇదేం తప్పుపనికాదు, — రంకులరాట్నం యెక్కడం కంటేనా..." అన్నాడు. మళ్లీ, తన సొంతపెండ్లాంవలె అల్లా అన్నందుకు నాలిక కొరుక్కున్నాడు దినకర్.

"వద్దు — నే ఉత్తరం రాస్తా నన్నానుగా."

"అడ్రెస్ తెలుసా?"

"ఓ, — యీసారి మళ్లా మా బావజబ్బుకు వస్తారుగా..."

"మళ్లీ మీ బావ జబ్బేమిటి?"

"మా బావకు జబ్బు ఆరేళ్లనుంచి — మీకు తెలీదూ?... నన్ను పోనీండి లోనికి..."

తన గదికి వెళ్లిపొయ్యాడు డాక్టరు.

3

దినకర్ పట్నం వెళ్లి నెల దాటిపోయింది. ఆదినం రాఘవరావు వూళ్లో లేడు. కాంతం బైటుంది.

కమలకు కవరు అందజేశాడు పోస్టుబంట్రోతు. పైన 'కాంతమ్మ'కు అని వ్రాసుంది.

"నీకు కవరొచ్చింది. చింపి చదవనా?" అని అడిగింది కమల. కాంతానికి కవరురావడం ఆశ్చర్యం కలగజేసినా, అది దినకర్ దగ్గరనుండే అయివుంటుందని తెలుసు. కమల ఉత్తరం పైకి చదివింది.

ప్రియమైన కాంతానికి,

ఆరాత్రి నే అడిగినదానికి సమాధానం వ్రాస్తానని వాగ్దానం చేశావు. మళ్లా జవాబు వ్రాయలేదు. ప్రతిదినం నీ ఉత్తరం కోసం యెదురుచూస్తున్నా. ఎందుకువ్రాయలేదో తెలియదు. ఒకవేళ నీకు యిష్టం లేకపోయినా, ఆసంగతి ఉత్తరంద్వారా తెలియజెయ్యడం సులభమైవుండికూడా, నువ్వు నాకు తెలియజెయ్యలేదంటే, నాకు ఆశ కలుగుతూంది. వెన్నెట్లో ఆనాటిదృశ్యం ప్రేమపూరితమైంది. నువ్వు కాదనలేవని నీ చిరునవ్వే చెప్పింది. వ్యక్తులు దగ్గరగా కలిసివున్నప్పటికంటె విడిపోయి దూరంగా వెళ్లినప్పుడే మనస్సులు దగ్గరగా వొస్తాయి. శరీరం, సంభాషణ, దుస్తులు, పరిస్థితులు, కాలం—యివన్నీ హృదయాల కలయికకు అంతరాయాలే. మూగమనస్సు ఏకాంతంలో పండి ముగ్గిపోతుంది. నా కిక్కడ అల్లాంటి ఏకాంతం లేదు. నీవద్దనుండి వొచ్చిన ఉత్తరంలో యేమీ లేక, వుత్తి తెల్లకాగితమైనా, అది నాకు ప్రశాంతం యివ్వగలదని నమ్మి. నాఅడ్రెసు మళ్లా వ్రాస్తున్నా. మీ అక్కయ్యను అడిగానని చెప్పు. మన ఉత్తర ప్రత్యుత్తరాలకు అక్కడ ఆటంకం లేదని నా నమ్మకం. మీ అక్కకు తెలిసినా, ఆవిడ దీన్ని అర్థంచేసుకుంటుందని నానమ్మకం. మీ అక్కకు నే పంపిన టానిక్కులు పని చేస్తున్నాయని తలుస్తా. ఉత్తరం అంతా 'జవాబు వ్రాయి' అని పదిసార్లు వ్రాయడం కంటే అది వ్రాయకపోతేనే నీవద్దనుండి సమాధానం వొస్తుందని, యేదో పెద్ద ఆశ నామనస్సును సంతోషకెరటాలతో నింపుతోంది.

మొదట్లో బిగ్గరగా చదవడం మొదలుపెట్టి, పోను పోను కమల కంఠం సన్నగిల్లి, తన్నుగురించి వ్రాసిన వాక్యాలదగ్గర ఆగిపోయి, ఆవుత్తరం తనకు కాదన్నవిషయం మరిచింది. "ఆవిడ దీన్ని అర్థంచేసుకుంటుంది"—ఇందులో డాక్టరుమనస్సు తనకు దగ్గరగా వొచ్చినట్లు స్ఫురించింది. అతని బాధ తనకు బోధపడుతుందని అతనికి తెలిసింది. ఏదో, ఈవుత్తరంలోని రహస్యం తనకోసమని కమలమనస్సులో వింత భావాలు చెలరేగాయి. ఈఉత్తరం శైలి, దీని కళానుగుణమైన అర్థాలు కాంతానికి అర్థంచేసుకోడానికి, ప్రయత్నించడానికి కూడా అర్హతలేదు. చెప్పరాని అసూయాభావం కమలలో వుదయించింది.

"ఏమే కాంతం, నాకు చెప్పలేదే యీసంగతి?" అంది, దండనాధికారం వున్నదానిమల్లె.

"..................."

"పోనీ, అతను మాతోనైనా యెందుకు చెప్పలేదు?"

"నేను ఆయనతో బావను అడగండని చెప్పా."

"అసలు ని న్నేమని అడిగాడు?"

"పెండ్లి విషయం"

"నువ్వేమన్నావ్ ?"

"చెప్పాగా?"

కమల ఆలోచనలో పడింది.

"అసలిదంతా యెప్పుడు జరిగింది?"

"ఏదంతా?"

"అదే,-వుత్తరంలో వుందిగా, వెన్నెలరాత్రి,-"

"ఏమీ లేదు. నేను జామకాయ తింటూంటే, ఆయన వచ్చి పెండ్లిమాట ప్రసంగించాడు."

"నువ్వేదో అధికప్రసంగం చెయ్యకపోతే ఆయ నిల్లాంటి ఉత్తరం వ్రాస్తాడా?"

"లే దక్కా! నీతోడు...అట్లాగయితే నే వుత్తరం వ్రాయనూ?"

"సరే, జవాబు వ్రాస్తావా?"

"నీయిష్టం."

"అదేమిటె, మొగుడాయనా, భార్యవు నువ్వు, నాదేముంది?"

"అట్లా అనకక్కా; ఎందు కంతకోపం? నువ్వు వ్రాయొద్దంటే మానేస్తాను."

కమలకు యెందు కింత కోపం వచ్చిందో కాంతానికి తెలియలేదు.

మూడు దినాలు గడిచాయి. మళ్లా పట్నంనుండి ఉత్తరం వచ్చింది. అందులో కొన్ని ముఖ్యమైన భాగాలు "—నాకు కొద్దిరోజులలో గవర్నమెంటు నౌకరీ కాబోతోంది. నువ్వు పల్లెటూరిపిల్ల వనీ, బీదదాన వనీ నేను చేసుకో ననుకుంటా వేమో. అల్లా అనుకోవద్దు. నిజానికి నీలాంటిదానికోసమే యిన్నాళ్లు కాచుకునివున్నా. నన్ను నిరాకరిస్తే లోకంలో 'దయ' అనేది లేదేమో అనుకోవాలి. లేక మీకమలా, మీబావా యిష్టపడలేదా? అసలు వాళ్లు యీవార్త విని సంతోషించాలే? అందులో మీకమల యెంతో చమత్కారంగా ఈపెళ్లికి అనుకూలపడుతుం దని నాగట్టినమ్మకం...పోనీ, యేవిషయం అయినా జవాబు వ్రాయరాదూ? నీ కిష్టమైతే మీబావకు వ్రాస్తాను..."

ఇందులో తన్నుగురించిన వాక్యాలను పైకి చదివి వినిపించలేదు కమల. అది కాంతానికి సంబోధింపబడ్డాయన్న విషయం కమలకు బాధాకరమైంది. డాక్టరు తన చెయ్యి పరీక్షచేసినప్పుడు తనగుండె లెందు కల్లా కొట్టుకున్నాయి? ఆచేతితాలూకు వేడి తన అరచేతిలో దాగివుంది. కాంతాన్ని "జవాబురాస్తే రాసుకో" అంది యీసడింపుతో.

కాంతానికి తెలుగువ్రాతలో ప్రవేశం తక్కువ. తెనుగు వచ్చినా, యెప్పుడూ కాగితంమీద, చాకలి పద్దు, సంతబిల్లు తప్ప కలంపెట్టిన అభ్యాసం లేదు. తను వ్రాస్తే సకలతప్పులూ వొస్తాయనీ, తన తెలివి తక్కువతనానికి దినకర్ ఆశ్చర్యపడతా డనీ కాంతానికి జవాబువ్రాయడం భయం.

"పోనీ, నాబదులు నువ్వు వ్రాయకూడ దక్కా"

"అల్లా బాగుండదు. నువ్వే రాయి."

"నే రాస్తే తప్పులొస్తాయి."

"తప్పులొస్తే పెండ్లిచేసుకోడని భయమా?"

"కాదక్కా, నేను చదువుకున్నదాన్ని కాదుగా నీలాగా. పోనీ, నే చెప్పినట్టుగా రాయకూడదూ?"

"ఏమని రాయమంటావు?"

"ఏదో నీయిష్టమొచ్చింది రాయి."

ఇద్దరూ చేరి వ్రాసిన జవా బిది:

డాక్టరుగారికి —

మీకు జవాబు యింత ఆలస్యంగా వ్రాసినందుకు యేమీ అనుకోకండి. మా బావా, కమలా ఏమీ అనలేదు. వాళ్లకీ సంగతే తెలియదు. మీ రనుకున్నట్లు నేను పల్లెటూరిపిల్లనన్న భయంవల్ల వ్రాయలేదు. మీప్రశ్నకు జవాబు నాకుతెలియదు. పెండ్లికీ నాయిష్టానికీ సంబంధం కనిపించదు. మా కమలఆరోగ్యం బాగానే వుంది. బిల్లు కొద్ది రోజుల్లో పంపుతాము...

కాంతానికి తెలియకుండా మరికొన్ని వాక్యాలు చేర్చింది కమల యీ వుత్తరంలో—

మీరు నన్నిల్లా ఆరాధిస్తా రని అనుకోలేదు. నాహృదయంలోనూ ప్రేమజ్యోతి వుంది. కాని మీ వుత్తరంతో అది వెలిగి

ప్రకాశిస్తోంది. నాకు యేదో ఆశ వుంది— దాని కేపేరు పెడతారో మీయిష్టం. ముద్దుకు పేదవులు లేవు. లేఖే పదివేల ముద్దులు.

ఇల్లా వ్రాసి, యీచివరి రెండువాక్యాలూ, అక్షరాలు కనపడేటట్టుగా గీతలుగీచి కొట్టేసింది కమల.

ఈ ఉత్తరానికి జవాబు వారంరోజులకే వచ్చింది. కాని వీటిని చదివే భాగ్యం కాంతానికి లేదు. చదవడం, జవాబువ్రాయడం కమలకే వొదిలేసింది. కమలకు తనమీద పెద్ద అనురాగమని కాంతానికి గట్టినమ్మకం. ఉత్తరంలో కొన్నే వాక్యాలు చదవడమో, లేకపోతే లోపల చదివి సారాంశం చెప్పడమో, చివరికి చించెయ్యడం—అదీ ఆవుత్తరాల ఖర్మ.

ఈమూడో ఉత్తరంలో కొన్ని వాక్యాలు—

...నీవుత్తరం యెంతో సంతోషంతో చదివాను. మొదటి వాక్యాలు చదువుతూంటే నిరుత్సాహం బైలుదేరినా కడపటి వాక్యాలు చదవగానే, మళ్లా నా ఆశాలత పుష్పించింది. మానవహృదయానికి వైశాల్య నిర్ణయం లేదు. పల్లెటూరైనా, ప్రేమకు రెక్కలున్నాయి. అదిగాక, నువ్వు చదువుకోనిదాని వంటే నేను నమ్మను. సిగ్గువల్ల అబద్ధం ఆడివుండొచ్చు. నిండుకుండలు తొణకవు. నీలో పెద్దలోతు లేకపోతే అంత చమత్కారంగా వ్రాసివుండవు. నువ్వు రోజూ యిల్లాంటి వాక్యాలు నాకు పంపుతూంటే, నాకు పెండ్లినిగురించి ఆదుర్దా వుండదు. స్త్రీహృదయం గొప్పది. తన సర్వస్వమూ త్యాగంచేసి, లోకాన్ని వశంచేసుకోగలదు. ఇది తెలియందీ, యెంత చదువుకున్నా ప్రయోజనం లేదు...

కాంతానికి యీవుత్తరం ఆశ్చర్యం కలగచేసింది. కొన్నిసంగతులు అసలు అర్థమే కాలేదు.

"కడపటివాక్యా లని వ్రాస్తాడు—అవి జ్ఞాపకం వున్నాయా నీకు?" అని అడిగింది కమల.

"ఏముంది? మందులకు బిల్లుపంపుతా మన్నాం, అంతేగా?"

"చూశావా, యెంతర్థం తీశాడో..."

"చదువుకున్నదానవ్ నీకు తెలియాలి, ఆ అర్థాలూ-- ఆగొడవంతా యేమిటి?"

"ఏముంది—పెండ్లిమాట..."

"ఇంకా తేల్లేదని నాలుగుముక్కలు రాసి పెడుదూ."

అల్లాగే, నాలుగునెల్లలో పది ఉత్తరాలు వ్రాసింది కమల; పదిహేను జవాబులు చదువుకుంది. ఈలేఖల్లో వ్యవహారాలు యేవీ లేవు. అంతా ప్రేమ, కలలు, ఆత్మలకలయిక, సమానత్వం, స్నేహం, జీవితంలో సౌందర్య ఆదర్శాలు—యిల్లాంటి సంగతులు చమత్కారమైన శైలిలో వ్రాయబడి వున్నాయి. కమల ప్రతి ఉత్తరంలోనూ కాంతం వ్రాసినట్లు వ్రాసినా, దినకర్ మనస్సుకు దగ్గరగా ప్రయాణం చేసింది. అతని వాక్యా లన్నీ తను వ్రాసినవాటికి జవాబులు. ఆమె హృదయంతో పిలిచింది, అతను పలికాడు. ఆపలుకులో ఆత్రత, తొందర, మాధుర్యం తన పిలుపుమీద ఆధారపడినవి. కాంతం అన్న పేరు వెనక దాక్కుని, దినకర్ వ్యక్తిని తనవశం చేసుకుంది. శరీరంతప్ప అతడు జీవితపు ఆశంతా రహస్యం లేకుండా కమలకు అర్పించుకున్నాడు. పురుషుడి ప్రధానమైన ఆనందాన్ని దాచుకున్న భవనాల తాళపుచెవులన్నీ కమల కిచ్చి, అతనిసంతోషంలో భూమి వొదిలి, మేఘాలలోకి నడిచాడు.

ఏడో వుత్తరంలో తనకు ఇంగ్లీషుకూడా వొచ్చునని తెల్పేందుకు, కొంతభాగం ఇంగ్లీషులోనే వ్రాసింది కమల. దానికి జవాబు ఇంగ్లీషులోనే వొచ్చింది. దాని అనువాదం—

స్వప్నకాంత కాంతానికి—

నా జీవితంలో రెండే చరిత్రాత్మకమైన సంగతులు జరిగాయి. మొదటిది నేను జనించడం; రెండోది నువ్వు ఇంగ్లీషులో వుత్తరం వ్రాయడం. నీ శైలిలో సహజమైన పోకడ, నీ ప్రత్యేకమైన వ్యక్తిత్వం గోచరిస్తున్నాయి. వ్యక్తిత్వాన్ని పాటించిన శైలే శైలి. నువ్వు నీ లోకానికి రాణివి. ప్రతివాక్యంలోనూ నీ విగ్రహం మెరిసి నాట్యంచేస్తూంది. ఏదో చప్పుడు వినిపిస్తోంది — అడుగుల చప్పుడో, అధరాల చప్పుడో...నీ నాట్యానికి మన ప్రేమ గానం చేస్తుంది.

తరువాతి వుత్తరాలలో యీ వేగం తగ్గింది. డాక్టరు పెండ్లివిషయం తేల్చమని తప్ప యితర భారతాలు వ్రాయడం తగ్గించాడు. చాలా వ్యావహారికంగా వుం...గా వుత్తరం......

... మీ బావకు యెప్పుడు వీలవుతుందో కనుక్కొని రాయి. నేను పెండ్లి పనులు సిద్ధంచేస్తాను. నాకు వేరే రావలసిన వాళ్లు యెవ్వరూ లేరు. మా అక్కకు ఏదో మాసంట, దూరప్రయాణం రాలేనని వ్రాస్తోంది. ఎంత ప్రేమయినా, దానికి కొంత ఆకారం కలగచెయ్యకపోతే, పారిపోతుంది. దానికి కొన్ని బంధనాలు తగిలించకపోతే, 'మంచితనం' లాగా, ప్రేమ ఆకారంలేని వస్తు (Abstract noun) వవగలదు.

ఇవన్నీ కమలకు శారీరకంగానూ, మానసికంగానూ కూడా చాలా ఆనందాన్ని కలగజేశాయి. నేటి కాలానికి తన వ్యక్తికి ప్రేమరాజ్యంలో స్థానం యేర్పడింది. స్త్రీకి 'ప్రేమ' యివ్వడంలో వున్న ఆనందం పుచ్చుకోడంలో లేదు. కాంతానికి యీ వుత్తరాల సంగతి తెలియదన్న విషయం కమలకు బాధ కలిగించలేదు. ఇది తెలిస్తే, తనకు విజయం ప్రాప్తిస్తుంది. శత్రువుపై తన కసి తీరుతుంది. అల్లా కాంతంపై కసితీర్చుకుని దినకర్‌కు దూరమవడంకంటె, వివాహానికి తోడ్పడి అతని సానుభూతి పొందడం ఒక పెద్దత్యాగం లా తోచింది కమలకు. కమలహృదయంలో యింకా నైతికభవనానికి పునాదులున్నాయి. చాలా సంగతులు దాచింది; కృత్రిమం సల్పింది; 'భర్త' అనే వొక సంస్థకు నామాన్నిమాత్రం మిగిల్చింది; కాని పునాదులను నిర్మూలం చెయ్యలేదు. స్వార్థానికి సంబంధించిన సంతోషం పొందినా, నైతికసంస్థకు కీర్తి నశింపు కాదు. కమల ఆఖరుసారి వ్రాసిన వుత్తరంలో యిల్లా వుంది:

...మీరు స్త్రీలను గురించి కవులు చాలా చెడుగా వ్రాశారనీ, వాటిని మీరు నమ్మరనీ వ్రాశారు. ఈ మీ నమ్మకం శాశ్వతంగా వుంటుందా అని నా అనుమానం. ఒకప్పుడేనా 'మంచిస్త్రీ చెడుగా ప్రవర్తించడం అంటే, చెడ్డదే పట్టుపడటం అన్నమాట' అనకుండా వుంటారా?...

ఈ వాక్యంలో కమల తనహృదయాన్ని యింకెవరివల్లా కానట్టుగా, సత్యంతో శోధించింది.

౪

డిసెంబరులో పట్నంలో వివాహం జరిగింది. పెండ్లికి రాఘవరావు, భార్యకూడా వచ్చారు. తరవాత రాఘవరావు వొక్కడూ వెళ్లిపోయి, దంపతుల్ని మనవూరు తీసుకురమ్మని భార్యకు అప్పచెప్పాడు.

ఆరాత్రి దినకర్ యిల్లంతా నిశ్శబ్దంగా వుంది. అతను, కాంతం, కమల తమలపాకులు వేసుకుంటూ, గ్రామఫోన్ పాటలు వింటూ కూర్చున్నారు.

"కాంతం! మా అక్కకు ఉత్తరం వ్రాస్తానని మరిచిపోయ్యావు. మొన్న చెప్పాను. మళ్లీ మనం రేపు మీవూరు వెళ్లాలి. అప్పుడు హడావుడిగా

వుంటుంది. అంచేత యిప్పుడే వ్రాయి. నీసంగతి మా అక్కయ్యకు వ్రాశాను: నీచేత ఇంగ్లీషులో వుత్తరం వ్రాయించమని చాలాసార్లు కోరింది..."

"ప్రస్తుతం తెలుగులో వ్రాస్తా లెండి..."

"అల్లా కాదు—ఏంలేదు, పెండ్లి బాగా జరిగిందనీ, తను సమయానికి లేకపోవడం మనకు విచారంగా వుందనీ. అంతే, రెండుముక్కలు..."

"అబ్బ, పోనిద్దురూ, నాకు తలనొప్పిగా వుంది."

"పోనీ, నేను చెప్తాను వ్రాయి."

కమల భయంతో వొణికింది. సంభావణ తప్పించడానికి ప్రయత్నంచేసింది కాని లాభం లేకపోయింది. దినకర్ డ్రాయర్లోంచి కాగితం, కలం తీసుకొచ్చి కాంతాని కిచ్చాడు.

"కానీ, 'డియర్ సరోజ్'..."

కాంతం కలం వొదిలేసింది.

"అబ్బే, సిగ్గుపడతారా...'మైడియర్ సరోజ్' ...ఊఁ..."

కాంతం పరుగెత్తుకు పోయింది మేడమీదికి. కమల దినకర్ కళ్లల్లోకి దీనంగా చూసింది.

"కాంతానికి ఇంగ్లీషు రాదండీ..."

"వేళాకోళ మాడకండి మీరు కూడా..."

"సత్యం. ఆ ఇంగ్లీషు వుత్తరాలు వ్రాసింది నేనే—కాంతం నన్ను వ్రాయమంది. తమాషాకు నేనే వ్రాశాను..." దినకర్ కొయ్యబారిపొయ్యాడు. మళ్లా మొదలెట్టింది కమల: "అసలా వుత్తరాలన్నీ కాంతం వ్రాసినట్టు నేనే వ్రాశాను. నాకు యితర అభిప్రాయం లేదు కాని, ఆవుత్తరాలు మీకు సంతోషం కలిగిస్తాయని నమ్మి అల్లా వ్రాశాను..."

"అన్యాయం చేశావ్... నా హృదయాన్ని అపహరించింది నువ్వు...కాంతం అప్పుడూ యిప్పుడూ ప్రేమంటే యేమిటో తెలియని పల్లెటూరి ఘటం. అమాయకపు మృగం..."

"దాన్ని కోప్పడకండి...దాని కివన్నీ తెలియవు కూడా... ఉత్తరంవల్ల హృదయాన్ని వశం చేసుకోవచ్చా, లేక పురుషులకు ఒక శరీరమే ప్రధానమా, చూద్దా మనుకున్నది యథార్థమైంది—మన మనస్సులు కలిశాయి. కాని కాంతానికి పెండ్లి జరిగింది... 'భార్య' అన్నది పేరు..."

"నాకు చిన్నతనంగా వుంది." అన్నాడు దినకర్.

"మీరు పల్లెటూరి పిల్లైనా చేసుకుంటా నని మొదట్లో వాగ్దానం చేశారు." అంది.

"నిజమే. ఈఉత్తరాలవల్ల కొత్త ఆశయాలు లేచి భగ్నమయ్యాయి. బీదవాడికి తృప్తి వుంటుంది, కాని కొంత ధన మిచ్చి, మళ్లీ అది పోతే వాడికి శాంతి వుండదు."

ఆమర్నాడు కమల వొంటిగా వెళ్లిపోయింది. రాత్రి పదకొండు కొట్టింది. రాఘవరావింకా యింటికి రాలేదు. ఏవో గుడిసెలు తగులపడ్డాయంటే చూడడానికి వెళ్లాడు. కమల కాంతానికి వుత్తరం వ్రాసింది. అందులో "...ఏవ్యక్తికైనా లోకంలో నెగ్గాలంటే, కొందరు శత్రువులు అవసరం. మన కల్లాంటి శత్రువులు లేకపోతే మనలో చాలామందికి పేరుప్రతిష్ఠలూ, ఊరు పేర్లూ వుండవు..."

ఇంతలో రాఘవరావు గదిలో కొచ్చాడు. కమల వులిక్కిపడి "ఎవ రది?" అని ఆదుర్దాగా అడిగింది.

"ఇంకెవరు? నీభర్త" అని సమాధానం.